## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

**తిమ్మాపూర్:** ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) కరీంనగర్‌లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది తాత్కాలిక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధించే విజ్ఞాన శాస్త్ర బోధన పద్ధతులు, కళావిద్యలో ఖాళీలున్నాయన్నారు. ఉర్దూ మాధ్యమంలో బోధించే సైకాలజీ/ఫిలాసఫీ, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతుల్లో ఖాళీలున్నాయని తెలిపారు. అభ్యర్థులు ఆయా విషయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఈడీ కలిగి ఉండాలన్నారు. బోధన పద్ధతులు బోధించేందుకు దరఖాస్తు చేసుకునేవారు సంబంధిత మేథడాలజీ బీఈడీలో పూర్తి చేసి ఉండాలని అన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన విరమణ పొందినవారు, నిరుద్యోగులు ఈనెల 14న సాయంత్రం 5 గంటల్లోగా ఎల్ఎండీకాలనీలోని డైట్ కళాశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు. దరఖాస్తుకు ధ్రువపత్రాలు జత చేయాలన్నారు.

### ప్రభుత్వ కళాశాలకు రండి


విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

**చొప్పదండి:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు శనివారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లపై ప్రిన్సిపాల్ శరత్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. చొప్పదండి, రాగంపేట, ఆర్నకొండ, వెదురుగట్ట గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరించారు. శరత్‌చంద్రప్రకాశ్, మనోహర్‌స్వామి, కొండయ్య, ఐలయ్య, భరణి, సబితారాణి, అనిత, రాజేందర్‌రెడ్డి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

**మానకొండూర్:** తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటానికి నిజాయితీగూడెం గ్రామస్తులు శనివారం క్షీరాభిషేకం చేశారు. నిజాయితీగూడెం, శ్రీరాములపల్లె మీదుగా, పెద్దూర్‌పల్లి, తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి వరకు రూ.6.11కోట్ల నిధులు మంజూరయ్యాయి. మాజీ సర్పంచ్ బోళ్ల వేణు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నాయకులపై చర్యలు తీసుకోవాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు


**హుజూరాబాద్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమ్మయ్యకు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ వివిధ పార్టీల నాయకులు పార్టీ తోరణాలను కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి పార్టీ తోరణాలు కట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ఖాలీద్ హుస్సేన్, ఉప్పు శ్రీనివాస్, గూడూరు స్వామిరెడ్డి, ఆకినపల్లి రమేశ్, వేల్పుల రత్నం, తులసి లక్ష్మణమూర్తి, డాక్టర్ తడికమల్ల శేఖర్, బండ లక్ష్మారెడ్డి(చెల్పూర్), మొలుగూరి మొగిలయ్య(చెల్పూర్), వేల్పుల ప్రభాకర్, చందు తదితరులున్నారు.

### వాలీబాల్ దినోత్సవం


ఆకునూర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**సైదాపూర్:** ఆకునూర్ ఉన్నత పాఠశాలలో శనివారం వాలీబాల్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వాలీబాల్ దినోత్సవం ఆదివారం కాగా.. ముందస్తుగా పాఠశాల మైదానంలో ప్రధానోపాధ్యాయుడు రామస్వామి వేడుకలు నిర్వహించారు. వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు భాస్కర్, సుధాకర్, నాయక్, చిరంజీవి, సుజాత ఉన్నారు.

### కమిషనర్‌కు సన్మానం



**హుజూరాబాద్:** పట్టణంలోని ఖబ్రస్తాన్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సందర్శించారు. ఖబ్రస్తాన్, ఉస్మాన్‌సేట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో నెలకొన్న సమస్యలను ఖబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విన్నవించగా.. సానుకూలంగా స్పందించారు. అనంతరం కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు.

### మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం


**సైదాపూర్:** వెన్నంపల్లిలో స్వయంభూ మత్స్యగిరీంద్రస్వామి కల్యాణ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సారబుడ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. వెన్నంపల్లి, లస్మన్నపల్లి, ఆరెపల్లి, బూడిదపల్లి, సోమారం, గర్రెపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాల నుంచి భక్తులు వచ్చారు.

### సప్తదశ బ్రహ్మోత్సవాలు


**జమ్మికుంట:** పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సప్తదశ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్ఛరణలతో శనివారం ఉదయం ఆరాధన, సేవాకాం, బాలోగం, మంగళాశాసనం గోపూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ హోమం, పూర్ణాహుతి, బలిహరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నిరుపయోగంగా చేతిపంపు


**చిగురుమామిడి:** బొమ్మనపల్లి ఎస్సీకాలనీ 10వ వార్డులో చేతిపంపు మూడు నెలలుగా నిరుపయోగంగా ఉంటోంది. కాలనీలో దాదాపు ఇరువై కుటుంబాలుంటాయి. రోజువారీ అవసరాలకు అందుబాటులో ఉన్న చేతిపంపు పని చేయక దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు.

# ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువపై రైతుల ఆసక్తి
- సబ్సిడీపై డ్రిప్, ఆయిల్‌పామ్ మొక్కలు అందజేత
- సాధారణ పంటలకు స్వస్తి


చిగురుమామిడిలో ఆయిల్‌పామ్ నర్సరీ

**చిగురుమామిడి:** గ్రామాల్లో ఆయిల్‌పామ్ సాగు శరవేగంగా సాగుతోంది. రైతులు వరి, మొక్కజొన్న, ఇతర పంటల కంటే ఆయిల్‌పామ్ సాగుపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ నీరు, అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలో 17 గ్రామాలకు గాను 8 గ్రామాలకు చెందిన రైతులు దాదాపు 190 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు రైతుల వాటాధనం కింద డీడీలు చెల్లించి నాటారు. ఇప్పటివరకు మరో 100 మంది ఆసక్తి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ మొక్కలకు డీడీలు కట్టారు.

**రూ.4,200 చెల్లింపు**

ఒక ఎకరం ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం భారీగానే సబ్సిడీ అందిస్తోంది. రూ.2,100 మొక్కల సంరక్షణ కోసం హార్టికల్చర్ శాఖ నుంచి చెల్లిస్తుండగా.. మరో రూ.2,100 అంతర పంటల సాగు కోసం ఎరువులకు సబ్సిడీ కింద అందిస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు 4 సంవత్సరాల వరకు ఎలాంటి ఆదాయం రాదు. అందుకు గాను 4 సంవత్సరాలపాటు మొక్కల మధ్య అంతర పంటలైన పత్తి, శనగ, వేరుశనగ, ఆలసంద, మొక్కజొన్న పంటలను సాగు చేసుకొని ఆదాయం పొందొచ్చు. ఈ అంతర పంటల సాగుకయ్యే పెట్టుబడి ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది.

**మొక్క ఖరీదు రూ.198**

ఒక ఆయిల్‌పామ్ మొక్క ఖరీదు రూ.198 కాగా.. అందులో రూ.178 ప్రభుత్వమే భరిస్తోంది. రైతు కేవలం రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అలా 200 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు మొక్కల కోసం రూ.20 చొప్పున డీడీలు చెల్లించారు.

**సబ్సిడీపై డ్రిప్ అందజేత**

ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేసిన రైతులకు ప్రతి ఎకరానికి సరిపడా డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని సబ్సిడీపై హార్టికల్చర్ శాఖ అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకైతే 100 శాతం సబ్సిడీ కింద డ్రిప్‌ను అందిస్తుండగా.. బీసీ రైతులకు 5 ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీ, ఓసీ రైతులకు ఐదెకరాల్లోపు ఉంటే 80 శాతం సబ్సిడీ కింద డ్రిప్ ఇరిగేషన్‌ను అందిస్తున్నారు.

**పెట్టుబడులు పెట్టలేక..**

బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, నవాబుపేట్, ఇందుర్తి, చిగురుమామిడి, చిన్నముల్కనూర్, ముదిమాణిక్యం, లంబాడిపల్లి గ్రామాల రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో రైతులు సాధారణ పంటలైన వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, కూరగాయలతోపాటు పలు రకాల పంటలు సాగు చేసి విసిగిపోయారు. అధికంగా పెట్టుబడులు పెట్టినా అనుకున్నస్థాయిలో ఆదాయం రాకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. విసిగివేసారిన రైతులు ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపారు. ఈ పంట సాగు చేసిన రైతులకు 4 సంవత్సరాల తరువాత ఆదాయం అధిక మొత్తంలో వస్తుంది. ఒక హెక్టార్ ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు 25 నుంచి 30 టన్నుల పామాయిల్ గెలల దిగుబడి వస్తుంది. సంవత్సరంలో నాలుగు నుంచి ఐదుసార్లు గెలల దిగుబడి వస్తుంది. ఒక పంట రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర ఆదాయం సమకూరే అవకాశముందని భావించిన రైతులు సాధారణ పంటల సాగుకు స్వస్తి చెప్పడం విశేషం. చిగురుమామిడి సమీపంలో ఏర్పాటు చేసిన లోహియా ఎడిబుల్ కంపెనీ ఆయిల్‌పామ్ నర్సరీ నుంచి రైతులకు మొక్కలను సరఫరా చేస్తున్నారు.

**ఆదాయం వస్తుందని..**



సాధారణ పంటల సాగుతో విసిగివేసారిపోయాను. పెట్టుబడి ఎక్కువ.. ఆదాయం తక్కువ. సరైన దిగుబడి లేక ఏటా అప్పులు పెరుగుతున్న దృష్ట్యా ఆయిల్‌పామ్ సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని భావించి రెండెకరాలు సాగు చేస్తున్న. అధికారులు సబ్సిడీ కింద డ్రిప్, అంతర పంటల సాగు కోసం డబ్బులు కూడా ఇస్తున్నారు.

– బుర్ర రాజయ్య, రైతు, ఇందుర్తి

**మంచి స్పందన..**



మండలంలో ఆయిల్‌పామ్ సాగు కోసం రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు 190 ఎకరాల్లో మొక్కలు నాటించాం. సాధారణ పంటల కంటే ఆయిల్‌పామ్ సాగుతో ఎలాంటి పెట్టుబడి లేకుండా రైతుల ఆదాయం రెట్టింపయ్యే అవకాశముంది. మరో 100 ఎకరాల సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం.

– బుర్ర మంజువాణి, హార్టికల్చర్ శాఖ అధికారిణి, చిగురుమామిడి మండలం


**సైదాపూర్:** సైదాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్లు ఏడాదిగా నిరుపయోగంగా ఉన్నాయి. మరమ్మతులు చేసినట్టే చేసి బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ తాళం వేశాడు. ప్రస్తుతం తాళం తీశారు కానీ నీటి సౌకర్యం లేదు. బస్టాండ్‌లో నీరు, విద్యుత్ సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్, ఆర్టీసీ డిపో మేనేజర్, హుజూరాబాద్, సెల్ నంబర్: 9959225924

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227


పోటీలు ప్రారంభిస్తున్న కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి

### శ్రీచైతన్యలో క్రికెట్ పోటీలు

**తిమ్మాపూర్:** తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ 2025 క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీకాలనీలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ప్రతి ఏడాది తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు సీతామాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నడిమెట్ల గణేశ్ తెలిపారు. కాసర్ల భూలక్ష్మి జ్ఞాపకార్థం రెండు రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. వైస్ ప్రెసిడెంట్ లోకిని కుమార్, సదన్‌యాదవ్, అనితరాజ్, రాంరెడ్డి, వాయుకుమార్, స్వరూపరాణి, కోశాధికారి కనపర్తి శ్రీనివాస్, కలర్ సత్తన్న, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కాలువ నిర్మాణం పూర్తి చేయాలి


అసంపూర్తిగా డ్రైనేజీ కాలువ పనులు

**జమ్మికుంట:** పట్టణంలోని బ్రిడ్జి సమీపంలో ప్రధాన రోడ్డు ఆనుకొని ఉన్న డ్రైనేజీ కాలువ నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిపివేశారు. 2021 ఉప ఎన్నికల సమయంలో పనులు చేసి వదిలేశారు. నాలుగు సంవత్సరాలుగా 15 మీటర్ల విస్తీర్ణ పనులను చేయడం లేదు. గతంలో పలుమార్లు పాలకవర్గం, అధికారులకు సమస్యపై విన్నవించినా పనులు చేయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి పూర్తి చేయాలని 7వ వార్డుకు చెందిన ఫిరోజ్, కాలనీవాసులు కోరుతున్నారు.

### బీజేపీ నాయకుల సంబరాలు


హుజూరాబాద్‌లో స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకులు

**హుజూరాబాద్:** పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడాన్ని హర్షిస్తూ స్వీట్లు పంచారు.

**ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనం**

**చొప్పదండి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం ద్వారా ప్రజలకు బీజేపీ నాయకత్వంపై ఉన్న విశ్వాసం మరోమారు రుజువైందని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 27 ఏళ్ల తర్వాత ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని, డబుల్ ఇంజిన్ సర్కార్ కళ నెరవేరిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో పన్ను మినహాయింపు అంశం ఢిల్లీలోని మధ్యతరగతి ప్రజలకు ఊరట ఇచ్చిందన్నారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ప్రజలు మద్దతు పలికారని అన్నారు.

**ఆర్థిక సంఘం నిధులకు అర్హత**

**జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపల్ 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుల వసూలులో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో కొనసాగుతున్నామని, 12.5 జీడీపీ సాధించి 15, 16వ ఆర్థిక సంఘం నిధులకు అర్హత సాధించామని కమిషనర్ ఎండీ ఆయాజ్ అన్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో 77.95 శాతం వసూలైందని, ఆస్తి పన్నులు చెల్లించేవారున్నారని, వచ్చే నెల చివరి వరకు వంద శాతం పన్నుల వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు.

## క్రైం కార్నర్..

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై విచారణ


విచారణ చేపడుతున్న ఏసీపీ శుభం ప్రకాశ్

**చిగురుమామిడి:** చిగురుమామిడిలో శనివారం కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై విచారణ నిర్వహించారు. తిమ్మాపూర్ సీఐ స్వామితో కలిసి వైన్స్ దుకాణం ఎదుట బాధితుడు సావుల నాగార్జునను విచారించారు. ఈనెల 6న సాయంత్రం చిగురుమామిడికి చెందిన గొరింకల సతీశ్ మద్యం మత్తులో నాగార్జునను కులం పేరుతో దూషించి అవమానించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం చిగురుమామిడి ఎస్సై బి.రాజేశ్ ప్రాథమిక విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారు. ఏసీపీ శుభం ప్రకాశ్ వైన్స్ దుకాణం ఎదుట సాక్షుల సమక్షంలో విచారణ చేశారు. నాగార్జున వైన్స్ పక్కన పర్మిట్ రూం నిర్వహిస్తున్నాడు.

**ఇద్దరిపై కేసు**

**జమ్మికుంట:** దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి శనివారం తెలిపారు. పట్టణంలోని గణేశ్‌నగర్‌కాలనీకి చెందిన ఫిరోజ్ పాషా అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్, షేక్ ఇంటియాజ్ పాషా దూషించారు. శుక్రవారం రాత్రి దాడికి పాల్పడగా.. గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

**ఐదుగురిపై..**

అదనపు వరకట్నం వేధింపులకు పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన సునీత, కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం రామవరం గ్రామానికి చెందిన దీకొండ రాజశేఖర్‌కు 2022లో వివాహం జరిగింది. రూ.6లక్షలు, బంగారంతోపాటు కట్నకానుకలిచ్చారు. అదనపు కట్నం తీసుకురావాలని కొన్ని రోజులు పంచాయితీలు జరిగాయి. ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త రాజశేఖర్, అత్త ఈశ్వరి, ఆడపడుచు-భర్త ఆదురి మధురి, రవికుమార్, బొంకురి పోచం అనే ఐదుగురిపై అదనపు వరకట్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

**తాళం వేసిన ఇంట్లో చోరీ**


చొప్పదండి: వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

**చొప్పదండి:** పట్టణంలోని విజయనగరంకాలనీకి చెందిన సామల తిరుపతి ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. ఈనెల 3న తిరుపతి వాళ్ల అత్తమ్మ మృతిచెందడంతో హుస్నాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి ఈనెల 7న తిరిగి వచ్చి చూడగా.. ఇంటి కాంపౌండ్ వాల్ గేటుకు వేసిన తాళం వేసినట్టే ఉంది. ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా.. సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్‌రూంలోని బీరువాలో ఉన్న బంగారు బ్రాస్లెట్, ఉంగరం, రెండు జతల వెండి పట్ట గొలుసులతోపాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఎస్ఐ గొల్లపల్లి అనూష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్‌టీం సభ్యులు వచ్చి వేలిముద్రలను సేకరించారు.

**వ్యవసాయ మోటార్లు..**

**శంకరపట్నం:** మొలంగూర్ గ్రామంలో రెండు వ్యవసాయ మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. మొలంగూర్ గ్రామానికి చెందిన పొద్దుటూరి సుభాష్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్ ఎల్ఎండీ ఉప కాలువకు వ్యవసాయ మోటార్లతో పంటలకు సాగు నీరు పారిస్తున్నారు. శుక్రవారం మోటార్లు పెట్టి పంటలకు సాగు నీరందించగా.. శనివారం తెల్లవారుజామున కాలువ వద్దకు వెళ్లి చూసేసరికి మోటార్లు కనిపించలేదు. రెండు మోటార్లు దొంగలు ఎత్తుకెళ్లారని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. మూడు రోజుల క్రితం గాజుల రమేశ్‌కు చెందిన వ్యవసాయ మోటార్ చోరీకి గురైందని రైతులు పేర్కొన్నారు.

### మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా కాల్వ స్వప్న



**తిమ్మాపూర్:** మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌కు చెందిన కాల్వ స్వప్న నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు.



**హుజూరాబాద్:** పట్టణానికి చెందిన లంక దాసరి లావణ్య ప్రవీణ్‌ను మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి శనివారం నియామక పత్రం అందజేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తానన్నారు.

**ప్రధాన కార్యదర్శిగా స్వరూప**

**చొప్పదండి:** పట్టణానికి చెందిన గుంటి స్వరూపను మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం చేస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి నియామక పత్రం శనివారం అందించారు. కాంగ్రెస్ పార్టీలో మహిళలను అత్యధికంగా చేర్పించడంలో కృషి చేసిన స్వరూప సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం చేసినట్లు తెలిపారు.

**జమ్మికుంట:** మహిళా కాంగ్రెస్ జమ్మికుంట పట్టణ అధ్యక్షురాలిగా పూదరి రేణుక శివకుమార్‌గౌడ్‌కు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న నియామక పత్రం అందజేశారు.

**శంకరపట్నం:** లింగాపూర్ మాజీ సర్పంచ్ కవ్వ పద్మ రెండోసారి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా నియామకమయ్యారు.

**ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య**

**మానకొండూర్:** ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన అందుతుందని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 145వ వార్షికోత్సవం శనివారం జరిగింది. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలు దేవాలయాలుగా వెలుగొందుతున్నాయన్నారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. మండల విద్యాధికారి మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ**

**మానకొండూర్:** మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ బంజారా ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను స్థానిక వైద్యాధికారి సల్మాన్ శనివారం ఆవిష్కరించారు. సీహెచ్‌వో రాజునాయక్, సహనవాజ్, జ్యోతి తదితరులున్నారు.

### రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ



**గంగాధర:** స్పెక్ట్రమ్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో గర్శకుర్తి గ్రామంలోని సరస్వతి విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచి నగదు బహుమతి సాధించినట్లు కరస్పాండెంట్ మిట్టపల్లి రాజశేఖర్ పేర్కొన్నారు. వరుణ్‌తేజ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి మొదటి స్థానంలో నిలిచి రూ.8వేల స్కాలర్‌షిప్ కైవసం చేసుకున్నాడు. నాల్గోతరగతి విభాగంలో కీర్తిప్రియ అనే విద్యార్థి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.1,500 స్కాలర్‌షిప్ సాధించింది.